ప్రింటింగ్, ప్యాకేజింగ్‌లో ఆధునికత

● ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ బాలకృష్ణ



ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ భారత్ ఆవిష్కరణలో ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ బాలకృష్ణ

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రింటింగ్, ప్యాకేజింగ్ విభాగంలో ఆధునిక సాంకేతికత వచ్చిందని తద్వారా వేగవంతంగా ముద్రణ, సురక్షితమైన రవాణాకు ప్యాకేజింగ్ అనుకూలమైందని ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ ఎంజీ బాలకృష్ణ అన్నారు. ఆలిండియా ప్రింటర్స్ అసోసియేషన్ చైర్మన్ సతీశ్ మల్హోత్రాతో కలసి భారత్ ప్రింట్ ఎక్స్‌పోను బీఐఈసీలో ప్రారంభించారు. సమావేశానికి రాష్ట్ర ప్రింటర్ల సంఘం అధ్యక్షుడు బీఆర్ అశోక్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కర్ణాటక సంఘానికి 86ఏళ్లు నిండిందన్నారు. విదేశీ సాంకేతికత సద్వినియోగం చేసుకోవడం కీలకమన్నారు. ప్రాచీన కాలంనాటి ముద్రణా విభాగాల మార్పునకు ఇదో మంచి వేదిక అన్నారు. 1997లో బెంగళూరులో జరిగిన ప్రింటర్స్ ప్రదర్శన ద్వారా మార్పులకు శ్రీకారం చుట్టినట్టయ్యిందన్నారు. అప్పటి నుంచి డిజిటల్ ప్రింటింగ్ విధానం పెరుగుతూ వచ్చిందన్నారు. ఆలిండియా ప్రింటర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్ జనార్ధన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. అమెరికా, జపాన్, భారత్, చైనాలు ఒకే విధమైన ప్రింటింగ్ టెక్నాలజీ కలిగి ఉన్నాయన్నారు. శనివారంతో ప్రదర్శన ముగిసింది. 250మంది ఎగ్జిబిటర్‌లు పాల్గొనగా, దక్షిణాది రాష్ట్రాల నుంచి పలువురు పాల్గొన్నారు.

డిగ్రీతోపాటు నైపుణ్యత అవసరం

● వీటీయూ వీసీ విద్యాశంకర్



వీటీయూ వీసీ విద్యాశంకర్‌కు సన్మానం

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం డిగ్రీ పొందామంటే ఆధునిక యుగంలో పోటీ పడలేరని నైపుణ్య శిక్షణ ముఖ్యమని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యనివర్సటీ (వీటీయూ) వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ విద్యాశంకర్ అన్నారు. కెంగేరిలోని ఎస్‌జేబీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వార్షిక సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాశంకర్ మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం అనే మనోభావాన్ని పెంచుకోవాలన్నారు. కేవలం డిగ్రీతోనే ఇంజనీర్ కాలేరని, నైపుణ్యత కీలకంగా భావించాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు ఆఫర్‌లు ఇస్తున్నాయని, అది కేవలం నైపుణ్యం కల్గినవారికి మాత్రమే దక్కుతున్నాయన్నారు. సామర్థ్యాన్ని పరిశీలించే సాంకేతికతను రూపొందించామని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం నేర్పుతున్నామని విద్యార్థులు కష్టపడే తత్వంతో ముందుకెళ్లాలన్నారు. బీజీఎస్ ఎస్‌జేబీ గ్రూప్ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ ప్రకాశనాథస్వామీజీ మాట్లాడుతూ సమాజంలో అందరూ డబ్బుకోసం పరుగులుతీసే విధానం దారుణమన్నారు. బాలగంగాధరనాథస్వామీజీ విద్య అందించాలనే లక్ష్యంతో సంస్థ ప్రారంభించారని, ప్రస్తుతం 1.5 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. కార్యక్రమంలో టాటా ఎలాక్సీ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ నవీన్‌మంజునాథ్, ఎత్నోటిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ధనంజయ్‌గురూజీ, కిరణ్ రాజణ్ణ, కేవీ మహేంద్రప్రశాంత్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పుట్టరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల కళాప్రదర్శనలు



ప్రదర్శనలు వీక్షిస్తున్న ఫ్రాన్స్ దేశ కౌన్సిల్ జనరల్ మార్క్ లాని

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): లీసా స్కూల్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు ఓపెన్ డేస్ పేరిట ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యాషన్, ఇంటీరియర్, ప్రొడక్ట్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్ వంటి విభాగాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఫ్రాన్స్ దేశ కౌన్సిల్ జనరల్ మార్క్ లాని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదర్శనలు తిలకించారు. ఇండో ఫ్రెంచ్ విద్యా, సాంస్కృతిక సంబంధాలు బలపరిచేలా లీసాస్కూల్ కట్టుబడి ఉందని కొనియాడారు. స్కూల్ డైరెక్టర్ గిరీశ్ కేస్వాని, డిజైన్ డైరెక్టర్ అవి కేస్వాని పాల్గొన్నారు.

20 శుద్ధజల ప్లాంట్‌ల ఏర్పాటు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'ఐ జల్ ప్రాజెక్టులో భాగంగా స్వయంసహాయక సంఘాలు, పారిశ్రామికవేత్తల సహకారంతో 20 శుద్ధతాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాయర్ సంస్థ సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా సహభాగత్వంతో చిక్కబళ్లాపుర జిల్లా పరిధిలో 20 ఐ జల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాయర్ ఫౌండేషన్ ఇండియా డైరెక్టర్ రచనాపాండా మాట్లాడుతూ ఐ జల్ కేంద్రాలతో శుద్ధమైన తాగునీటిని అందించదలిచామన్నారు. 20 వాటర్‌ప్లాంట్‌ల ద్వారా 3లక్షలమందికి శుద్ధతాగునీరు సాధ్యం కానుందన్నారు. గుజరాత్, తెలంగాణ, మహారాష్ట్రలలో అమలు చేశామన్నారు. బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, సేఫ్‌వాటర్ నెట్‌వర్క్ ఇండియా డైరెక్టర్ రవీంద్ర సేవక్ తదితరులు పాల్గొన్నారు. ఏటీఎంల తరహాలో ఈ ప్లాంట్‌లు పనిచేస్తాయన్నారు.

70 ఏళ్లుగా షెడ్లలోనే జీవనం..!



● దెబ్బతిన్న నివాసాలు
● అసౌకర్యాల నడుమ అగచాట్లు
● ఇదీ నాలుగు మైనింగ్ ప్రభావిత ప్రాంతాల దుస్థితి

8

విద్యుత్ శాఖను వేధిస్తున్న..

సిబ్బంది కొరత..!

● ఉద్యోగులపై పనిభారం
● ఐదు విభాగాల్లో 28వేల పోస్టులు ఖాళీ



బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కరెంటు లేకుండా క్షణమైనా గడపలేని పరిస్థితి సమాజంలో ఏర్పడింది. రాత్రి లేదు పగలు లేదు ప్రతి ఇంటా కరెంటు వాడకుండా క్షణం గడవదు. ఆహారం వండుకోవాలన్నా, నీరు సమకూర్చుకోవాలన్నా, వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేయాలన్నా, చివరకు రాత్రి నిద్రించాలన్నా కరెంటు లేకుంటే సాధ్యం కాదు. అనునిత్యం చేతిలో మొబైల్ ఉంటేనే మనిషి పనిచేస్తున్నట్టుగా జీవనయానం మారిపోయింది. అటువంటి మొబైల్‌కు చార్జింగ్ కావాలన్నా విద్యుత్ ఉండాల్సిందే. ఇలా ప్రతిక్షణం కరెంటు లేకుండా గడిపే పరిస్థితి లేకుండా పోయింది.

● కరెంట్ షాక్ అంటే ఎవరికైనా భయమే. ఎటువంటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందోనని వెంటాడుతుంది. పనిచేసే ఉద్యోగులు నిరంతరం సేవలందిస్తున్నా నిత్యం ఉన్నతాధికారులు, ప్రజలు, వివిధ విభాగాల ముఖ్యులు, ప్రజాప్రతినిధుల నుంచి చీవాట్లు తినాల్సి వస్తోంది. ఉద్యోగుల కొరత విద్యుత్‌శాఖను వెంటాడుతోంది. ఏకంగా 28వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో ఉన్నవారే అదనంగా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది.

అసలే ఎండాకాలం...

విద్యుత్ వాడకం పెరిగింది. మరోవైపు వాతావరణంతో సంబంధం లేదనేలా ఎప్పుడంటే అప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు వారాలుగా రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో రోజుకోచోట సాధారణం నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. వర్షం వచ్చిందంటే ముందుగా విద్యుత్‌శాఖపైనే ప్రభావం చూపుతుంది, అందులోనూ అకాల వర్షాలు కావడంతో చెట్లకొమ్మలు, చెట్లు విరిగిపడి భారీగా నష్టం కలిగిస్తుంటాయి. వాతావరణంలో మార్పులతో కరెంటు వాడకం పెరిగింది. ఏమాత్రం ఒత్తిడి కలిగినా బ్రేక్‌డౌన్ అవుతుంటుంది. వెంటనే స్పందించకపోతే వ్యవస్థలు నిలిచిపోవడమే కాదు, క్షణాల్లో నేరుగా ఫోన్‌కాల్స్, పరోక్షంగా సోషల్‌మీడియా వేదికల ద్వారా విద్యుత్‌శాఖపై నెటిజన్లు విరుచుకుపడుతుంటారు. అయితే విద్యుత్‌శాఖ ఉద్యోగులు కూడా వారి పనితీరు ఎవరెంత ఒత్తిడి చేసినా మెయింటెనెన్స్ పేరిట దాటవేస్తుంటారు.

ఎస్కాం పేరు	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న వారు	ఖాళీ పోస్టులు
బెస్కాం	24,741	13,979	10,762
మెస్కాం	9,250	5,256	3,994
సెస్క్	10,460	6,469	3,991
హెస్కాం	16,907	10,461	6,446
చెస్కాం	10,239	7,350	2,859

● రాష్ట్రంలో 5 విద్యుత్ సరఫరా కంపెనీలు ఉన్నాయి. అన్ని కంపెనీలలో ఉద్యోగుల కొరత ఉంది. అన్నింటినీ కలిపితే 39శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యుత్ సరఫరా విషయంలో సకాలంలో పనులు పూర్తికాక వినియోగదారులు ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంటోంది. అకాల వర్షాలు కురుస్తుండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తరచూ కోతలు ఏర్పడుతున్నాయి. క్షణాలలోనే వందలాది ఫిర్యాదులు వస్తున్నా వాటిని పరిష్కరించేందుకు తగిన సిబ్బంది లేరు. ఈదురుగాలులకు కొమ్మలు విరగడంతో విద్యుత్ లైన్లు తెగడం, స్తంభాలు కూలడం వంటి ఘటనలతో కోతలు ఏర్పడతాయి. మరోవైపు లో ఓల్టేజీ సమస్యలతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. వాటిని మార్చడం, అప్‌గ్రేడ్ చేయడం, విద్యుత్‌స్తంభాలు, తీగలను మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.

అత్యవసరమే... సేవలు కష్టం

అన్నిశాఖలలో ఆధునికత వచ్చినట్టు విద్యుత్‌శాఖకు వచ్చింది. అత్యవసర విభాగమైన ఈ శాఖనుంచి సేవలు పొందడం కష్టంగానే ఉంటుంది. నగర ప్రాంతాల్లో వేగవంతంగా మరమ్మతులు సాగుతున్నా మారుమూల గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేందుకు రెండు మూడు వారాలు పడతాయనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా బోరుబావులనీటిపైనే జనం ఆధారపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఇతరత్రా సమస్యలు వస్తే పల్లె ప్రజలు తాగునీటికి తల్లడిల్లే పరిస్థితి కొనసాగుతోంది.

28వేల పోస్టులు ఖాళీ

ఐదు విద్యుత్ సరఫరా కంపెనీల ద్వారా 28వేల పోస్టులు ఖాళీగా ఉండడంతో పనిచేసేవారిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది. లైన్‌మెన్‌లు, మీటర్ రీడర్‌లు, ఇంజనీర్లు రోజూ ఎక్కువ సమయం పనిచేయాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మీటరు రీడింగ్ ఏజెన్సీలకు కేటాయించినా లైన్‌మెన్‌లు, ఇంజనీరింగ్ వంటి విభాగాలలో తప్పనిసరిగా రెగ్యులర్ ఉద్యోగులు కుస్తీ పడుతున్నారు. ఐదు ఎస్కామ్‌లకు కలిపి 71,567 పోస్టులు మంజూరయ్యాయి. వీటిలో 43,515 పోస్టులు భర్తీ చేశారు. మిగిలిన 28వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్‌లు, మెకానికల్ గ్రాడర్‌లు, మీటర్ రీడర్‌లతో కలిపి అన్ని విభాగాలలోనూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దశాబ్దాలకాలంగా పోస్టులు సంపూర్ణంగా భర్తీ కాలేదు. ఏటా రిటైర్డు అయ్యేవారిసంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా రాష్ట్రంలో సువిశాలమైన అటవీ ప్రాంతాలు, కాఫీతోటల్లో ఏర్పడే కరెంటు సమస్యలు సిబ్బంది కొరతతో పరిష్కారం కావడం లేదు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రెసిడెన్సీలో యుఫోరియా సాంస్కృతిక ఉత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో వార్షిక సాంస్కృతిక ఉత్సవం 2025ను యుఫోరియా పేరిట నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక కళాబృందాల రూపంలో ఊరేగింపు చేశారు. జానపద నృత్యమైన పులివేషం, డొల్లు కుణిత, కీలుబొమ్మలతోపాటు పలు ప్రదర్శనలు చేశారు. రోజంతా సాగిన కార్యక్రమాలు విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. లైవ్ సంగీతం, నృత్యంతోపాటు కళల ప్రదర్శనలకు వేదిక అయ్యింది. చిక్కబళ్లాపుర తోలుబొమ్మలు, ఇళకల్ చీరలతో సంప్రదాయ కళల ప్రదర్శన ఆకట్టుకుంది. చాన్సలర్ నిస్సార్ అహ్మద్ అధ్యక్షత వహించగా వైస్‌చాన్సలర్‌లు విజయన్ ఇమ్మానుయెల్, విద్యాశంకర్ శెట్టి, శివపెరుమాల్, సమీరుద్దీన్‌ఖాన్‌తోపాటు రిజిస్ట్రార్ సమీనా నూర్ పనాలి పాల్గొన్నారు.



గుల్బర్గా రోడ్లపై

పాకిస్థాన్ స్టిక్కర్లు..!

8

జానపదంతోనే సమాజంలో చైతన్యం

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జానపదంతోనే సమాజంలో చైతన్యం సాధ్యమైందని, నేటికీ కళలకు తిరుగులేదని ప్రముఖ వైద్యులు అంజినప్ప అన్నారు. శేషాద్రిపురం కళాశాలలో రంగసంస్థాన సంస్థ రాష్ట్రస్థాయి కళాసాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించింది. శేషాద్రిపురం విద్యాసంస్థల కార్యదర్శి ఉడే పి కృష్ణ ముఖ్యులుగా పాల్గొన్నారు. వైద్యులు డాక్టర్ అంజనప్ప మాట్లాడుతూ జనం మాట్లాడుకునే విధానంలోనే పుట్టిందే జానపదం అన్నారు. జానపద కళలతోనే గ్రామీణ ప్రాంతాల్లో కళలు, సంస్కృతి, సమైక్యం సాధ్యమయ్యాయన్నారు. ఉడే పి కృష్ణ మాట్లాడుతూ ఎవరు ఓపెన్‌మైండ్‌తో ఉంటేనే మనోభావాలు ఇతరులతో పంచుకోవడం సాధ్యమన్నారు. రంగసంస్థాన అధ్యక్షులు బండ్లహళ్ళి విజయకుమార్ మాట్లాడుతూ వచన గానాలతోపాటు జానపద సంస్కృతిని ఆధునిక యుగంలో విస్తృతంగా ప్రచారం చేయడమే లక్ష్యంగా రంగసంస్థాన పనిచేస్తోందన్నారు. ప్రొఫెసర్ మేజర్ ఆనందప్ప, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్ భార్గవి, కన్నడ విభాగం డాక్టర్ గీతా, పాత్రికేయుడు లేపాక్షి సంతోష్‌రావ్ పాల్గొన్నారు. శివకుమార్ బేగార బృందం కంసవధ యక్షగానాన్ని ప్రదర్శించగా రామనగర చంద్రశేఖర్ బృందం డొల్లుకుణిత ప్రదర్శించారు. హిదాయత్ అహ్మద్ మార్గదర్శకంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బృందం హాలక్కి సుగ్గి కుణితను, ఆనేకల్ నళినాక్షి బృందం కోలాటాన్ని ప్రదర్శించారు.



కళాబృందాలతో వేదికపై అతిథులు, ప్రముఖులు



అమ్మవారికి విశేష అలంకరణ

గంగమ్మదేవి ఉత్సవాలు ప్రారంభం

ముళబాగిలు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మపేటలో కొలువైన గ్రామదేవత గంగమ్మదేవి 23వ వార్షిక ఉత్సవాల్లో తొలిరోజు కార్యక్రమాలు వైభవంగా సాగాయి. అర్చకులు కుమార్‌దీక్షిత్, అమృతేశ్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషపుష్పాలంకరణ చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం పానకం, మజ్జిగ, పెసరపప్పుతోపాటు అన్నదానం చేశారు. స్థానిక ప్రముఖులు నారాయణస్వామి, కావేరి మంజునాథ్, ఎంజే మల్లికార్జున్, ఏన్‌టీ రెడ్డెప్ప, ఠాకూర్‌సింగ్, నటరాజ్ తదితరులు పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకావిష్కరణ

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభ నగరంలోని జయనగర్ ఏఎంసీ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. ఆదివారం ఉదయం 10-12.30 వరకు కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమానికి బెంగళూరు విశ్వవిద్యాలయ తెలుగు అధ్యయనశాఖ అధ్యక్షురాలు ఆచార్య కే ఆశాజ్యోతి అధ్యక్షత వహించనుండగా ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ప్రముఖ జర్నలిస్టు, రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు విచ్చేయనున్నారు. పుస్తకాన్ని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు కళారత్న ఏ రాధాకృష్ణరాజు ఆవిష్కరించనుండగా తొలి ప్రతిని అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎంవీ ప్రసాద్‌బాబు స్వీకరించనున్నారు. పుస్తకంపై సమీక్షను తిరుపతికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు గరికపాటి రమేష్‌బాబు చేయనున్నారని ప్రకటనలో తెలిపారు.

దావణగెరెలో పాకిస్థాన్ వైద్య విద్యార్థిని



● జిల్లా పోలీసు శాఖ గుర్తింపు
● విద్యార్థినిపై ఎలాంటి చర్యలు అవసరం లేదు
● ఎస్పీ ఉమా ప్రశాంత్

8

పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



పురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐలు

సాయంత్రం ప్రశాంతినిలయంలోని శాంతిభవన్, పడమటిగేట్, యాత్రికుల నివాసాలు, షాపింగ్ సెంటర్, సాయికుల్వంత్ సభామండపం, గణేష్‌గేట్, ప్రశాంతినిలయంలోని ముఖ్యమైన ప్రదేశాల పరిసరాలలో భద్రతాపరమైన ఏర్పాట్లను పరివేక్షించారు. ప్రశాంతి నిలయంలోని పలుప్రదేశాలను డాగ్‌స్క్వాడ్, బీడీ టీంలు తనిఖీలు నిర్వహించాయి. ఎస్పీ రత్న మాట్లాడుతూ దేశ, విదేశ పౌరుల భద్రతా పరమైన చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని హోటళుల, లాడ్జీలు, మామిళ్లకుంట కూడలిలోని ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఆయా సబ్‌డివిజన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మామిళ్లకుంట కూడలిలో ఎస్పీ వాహన తనిఖీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు సునీత, సురేష్‌కుమార్, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, వలి, ఆర్ఎస్సై ప్రదీప్‌సింగ్, స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బంది, మహిళాపోలీసులు తనీఖీల్లో పాల్గొన్నారు.



ప్రశాంతినిలయం సెక్యూరిటీ వింగ్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పురంలో 11మంది విదేశీయుల గుర్తింపు

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11మంది విదేశీయులను గుర్తించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పట్టణాన్ని జల్లెడ పట్టారు. గుడ్డం ప్రాంతంలో కార్డెన్ సర్చ్ నిర్వహించగా ఓ పాత నేరస్థుడు పట్టుబడ్డాడు. సాయంత్రం లాడ్జీలు, జన సమ్మర్థ ప్రాంతాలు, ప్రార్థనా మందిరాల్లో తనిఖీలు చేయగా ఖజకిస్థాన్‌కు చెందిన ఒకరు, కిర్గిస్థాన్ 9, ఉక్రెయిన్‌కు చెందిన ఒకరు హిందూపురంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ 11మంది జమాత్ కోసం వచ్చినట్లు ఆధారాలు ఉండటంతో పోలీసులు వదిలేశారు. అదేవిధంగా వాహనాలు తనిఖీ చేసి, రికార్డులేని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కదిరిఅర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 54వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభించినట్లు ఆర్గనైజర్ రామాంజనేయులు తెలిపారు. మొదటి రోజు లీగ్ మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై అనంతపురం జట్టు, శ్రీకాకుళం జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించాయన్నారు. కడపజట్టుపై తూర్పుగోదావరి జట్టు, నంద్యాల జట్టుపై చిత్తూరు, ప్రకాశం జట్టుపై పశ్చిమగోదావరి, నంద్యాల జట్టుపై విజయనగరం, బాపట్ల జట్టుపై కర్నూలు జట్టు గెలుపొందాయన్నారు. ఈపోటీలను జోన్ డీఎస్పీ శివకుమార్, కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, టీడీపీ సీనియర్‌నాయకుడు బంగారు క్రిష్ణమూర్తి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పీడీ నరసింహచారి, జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, కార్యదర్శి మహేష్ తదితరులున్నారు.

ముస్లిం పథకాలకు మోక్షం కలిగేనా..?

- వైసీపీ హయాంలో అటకెక్కిన ముస్లింల పథకాలు
- ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు





ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ముస్లిం కోసం ప్రవేశ పెట్టిన పథకాలను వైసీపీ హయాంలో జగన్‌రెడ్డి అటకెక్కించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-19 హయాంలో మసీదులలో ఇమాంలకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ.5వేలు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి పెద్దపీట వేశారు. జగన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తూ.. ముస్లింలకు ఎన్నో హామీలు గుప్పించారు. ఇస్లామిక్ బ్యాంక్, దుల్హన్ రూ.50వేల నుంచి రూ.లక్ష ఇస్తానని, ఇమామ్‌లకు రూ.10వేలు, మసీదు, ఈద్గాల మరమ్మతులకు రూ.25వేలు, విదేశీవిద్య తదితర హామీలిచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా ఉన్న వాటిని రద్దు చేశారని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫా రద్దు చేశారని, జీవనోపాధికి 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తుంటే వాటిని కూడా నిలిపివేశారని తెలిపారు. ఉర్దూ అకాడమీని అస్తవ్యస్తంగా తయారు చేశారు. కూటమి ఎన్నికల ముందు గత పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చింది. ఈ క్రమంలో దుల్హన్ పథకం, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. అవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. మిగిలిన పథకాలను తక్షణమే అమలు చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

దుల్హాన్ పథకాన్ని అమలు చేయాలి



తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో ముస్లింలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా పేద ముస్లింలకు దుల్హన్ పథకం ఓ వరం. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలని.. తోఫా ద్వారా సరుకులను అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అందిస్తున్న పథకాలన్నీ రద్దుచేసింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈద్గా, మసీదుల ఊసే పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా గత పథకాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాం. - బాబావలి, ధర్మవరం

కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి



ఐదేళ్ల జగన్ పాలనలో రుణాలే ఇవ్వలేదు. టీడీపీ హయాంలో ముస్లింలకు అందిస్తున్న పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం గత పథకాలన్నీ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి. రంజాన్ తోఫా, విదేశీ విద్య తప్పని సరిగా అందించాలి.

- ఫకృద్దీన్, ధర్మవరం

ఇంకానా..!

టిడ్కో గృహాల కోసం తప్పని ఎదురుచూపులు

పట్టణం	మంజూరైన గృహాలు	నిర్మాణం చేపట్టినవి..
తాడిపత్రి	6,529	5,184
ధర్మవరం	8,832	1,440
గుత్తి	39896	
హిందూపురం	2,750	1,200
కదిరి	3,762	1,104
పామిడి	2,599	1,344
పుట్టపర్తి	1,243	432
అనంతపురం	6,117	2,304
గుంతకల్లు	4,719	2,160
రాయదుర్గం	1,791	1,008
మొత్తం	38,740	16,272

ఇళ్లు కేటాయించకనే ఈఎంఐల బెడద

ఆందోళనలో లబ్ధిదారులు

ఇళ్ల పూర్తికి రూ.382 కోట్లతో ప్రతిపాదనలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో గృహాల కోసం లబ్ధిదారులకు నేటికీ ఎదురుచూపులు తప్పలేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు టిడ్కో గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16272 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించింది. చాలావరకు పూర్తి చేసింది కూడా. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లపాటు టిడ్కో గృహాలను గాలికొదిలేసింది. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు ఆవాసాలుగా మారిపోయాయి. గతేడాది కొలువుదీరిన కొత్త ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి గృహప్రవేశాలు కూడా చేపడతామని పేర్కొంది. దీంతో టిడ్కో ఇంజనీర్లు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తమకు ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకులు నోటీసులు పంపడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం త్వరగా టిడ్కో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి, లబ్ధిదారులకు అందజేయాలని ఆశిస్తున్నారు.



అనంతపురంలో టిడ్కో గృహాలు



అనంతపురంలోని ఏపీ టిడ్కో కార్యాలయం

నిర్వీర్యం చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు అపార్టుమెంట్ల తరహాలో టిడ్కో గృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. వాటిలో 16,272 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. పనులు చివరి దరకు చేరాయి. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ టిడ్కో ఇళ్లను పూర్తిగా అటకెక్కించింది. దీంతో అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు అవాసాలుగా టిడ్కో గృహాలు మారిపోయాయి. ఐదేళ్లూ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. టిడ్కో ఇంజనీర్లు చివరి నిర్మాణదశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గత వైసీపీ పభుత్వంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.



పుట్టపర్తిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల సముదాయం

రూ.382.92 కోట్లు అవసరం

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణానికి రూ.382.92 కోట్ల నిధులు అవసరం. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78 కోట్ల నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పూర్తికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్ల నిధుల అవసరం అని ప్రతిపాదనలు అందజేశారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, ఇంజనీర్లు(ఫైల్)



బ్యాంకుల నుంచి నోటీసులు

టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. 300 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడు రూపాయి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5.04 లక్షల వాటాతో మొత్తంగా యూనిట్ రూ.6.55 లక్షలుగా నిర్ణయించారు. 365 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడి వాటా రూ.3.40 లక్షలు, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 లక్షలు, బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు, మొత్తంగా యూనిట్ రూ.7.55 లక్షలుగా నిర్ణయించారు. 430 చదరపు అడుగుల ఇంటికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.90 లక్షలు, బ్యాంకు లోను రూ.3.65 లక్షలు, లబ్ధిదారుడి వాటా రూ.4.15 లక్షలు కలిపి యూనిట్ ధర రూ.8.55 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

ఈఎంఐ కట్టాలని నోటీసులు వచ్చాయి

2018లో రూ.25వేలు టిడ్కో ఇంటి కోసం కట్టాం. ఇంత వరకు ఇల్లు కేటాయించలేదు. అయినా ఈఎంఐ కట్టాలని బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. ఇదే విషయంపై అనేకమార్లు మున్సిపాలిటీ, టిడ్కో అధికారులను కలిసి విన్నవించా. అయినా పట్టించుకోవడం లేదు. ఇల్లే లేకుండా ఈఎంఐ ఎలా చెల్లించాలి? ఐదేళ్లపాటు అందరి చుట్టూ తిరిగినా సమస్య పరిష్కరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లపై నిర్ణయం తీసుకోవాలి.

- నాగేంద్రప్రసాద్, టిడ్కో లబ్ధిదారుడు, అనంతపురం

నిధులు రాగానే పనులు చేపడతాం



టిడ్కో గృహ సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగానే టిడ్కో గృహాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

- సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి జిల్లా

వేటగాళ్లు..!

మొద్దుల లోడు కనిపిస్తే చాలు వేటే..


బేరం కుదిరితే సరి.. లేదంటే చుక్కలే

తమ పరిధి కాకున్నా.. సామిల్లుల్లో హల్ చల్

అటవీశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలు



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మొద్దుల లోడు కనిపిస్తే చాలు అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధి దాటి వేటాడుతున్నారు. ఇది విధుల్లో భాగంగానా అంటే ఎంత మాత్రం కాదు. 'బేరం' కుదరగానే వదిలేస్తారు. లోడు తరలించేవారు రూల్స్ మాట్లాడితే మాత్రం వారికి పగలే చుక్కలు చూపిస్తారు. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు అడ్డు లేకుండా పోతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ రెండు ఉదాహరణలను పరిశీలిస్తే క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతలా బరితెగిస్తున్నారో అర్థం అవుతుంది.



- సొంత భూముల్లో పెంచుకొన్న వేపచెట్లను కోసి ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండగా రెండు వాహనాలను గత గురువారం పట్టుకున్నారు. ఇందులో ఒక వాహనం గార్లదిన్నె మండలం నుంచి, మరో వాహనం ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ వాహనాలను పట్టుకుంది మాత్రం శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్. అది కూడా అనంతపురం నగరంలోని ఓ సామిల్లులో. శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్‌కు అనంతపురం సామిల్లులో ఉన్న వాహనాలను పట్టుకొనే అధికారం ఎవరిచ్చారన్నదే ఇక్కడ ప్రశ్న. గార్లదిన్నె మండలం నుంచి వచ్చిన మొద్దులకు సంబంధించిన యజమానులు రూ.10 వేలు ముట్టచెప్పడంతో ఎలాంటి రసీదు లేకుండానే చేతి ఖర్చుల కింద పెట్టుకొని వదిలేసినట్లు తెలిసింది. సొంత పొలాల్లో పెంచుకున్న చెట్లు కొట్టుకోవడానికి రూ.500 చెల్లించి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. అలా చేయక పోవడమే అవినీతి అధికారులకు కలిసి వస్తోంది.
- ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చిన వాహనంలో మొద్దులు ఎక్కువ ఉండటంతో మామూళ్లు కూడా ఎక్కువ ఆశించినట్లు సమా చారం. యజమానులు రూ.ఐదు వేలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే తిరస్కరించినట్లు తెలిసింది. వాహన డ్రైవర్ మాత్రం తనకెందుకు తలనొప్పి అని యజమాని చెప్పిన గుత్తిరోడ్డులోని ఓ సామిల్లులో మొద్దులు వదిలేసి వెళ్లిపోయాడు. ఇక చేసేది ఏమి లేక క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులతో చర్చించారు. టన్ను రూ.17 వేల ప్రకారం నాలుగు టన్నులకు అపరాధ రుసుం చెల్లించాలని హుకుం జారీ చేశారు. అయితే అక్కడ ఉన్న మొద్దులు అంత విలువ చేయవు. చూసి తగిన న్యాయం చేయాలని వేడుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఉన్నతాధికారి మొద్దుల యజమానులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. అధికారి తీరుకు నిరసనగా మొద్దుల యజమాని తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపి, ఇక్కడ జరుగుతున్న అక్రమాలను శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చాడు. సదరు బీట్ ఆఫీసర్‌గాని, సంబంధిత అధికారి గాని అందుబాటులో లేరు. అయితే ఇక్కడ చోటు చేసుకున్న తంతు వారిద్దరి దృష్టికి వెళ్లింది. దీంతో ఈ సమస్య తమకు ముప్పుగా మారే అవకాశం ఉందని గ్రహించి, ఒక టన్నుకు మాత్రమే ప్రకారం అపరాధ రుసుం కట్టించుకుని వదిలేశారు. అయితే 4 టన్నులకు కట్టించాలని అనుకున్న అధికారులు ఒక టన్నుకే ఎందుకు కట్టించారన్నదే ఇక్కడ ప్రశ్న. డీఎఫ్ఓ విఘ్నేష్, సీఎఫ్ యశోదబాయి స్పందించి క్షేత్రస్థాయి సిబ్బంది ఆగడాలు అరికట్టాల్సి ఉంది.



అటవీశాఖ జిల్లా కార్యాలయం (ఫైల్)

ఎడారి నివారణకు ప్రణాళికలు రూపొందించండి

డ్వామా రాష్ట్ర బృందానికి ప్రభుత్వ విప్ కాలవ సూచన

బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో రాష్ట్ర బృందం పర్యటన

అనంతపురం/క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలో ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందానికి సూచించారు. ఈ మేరకు శనివారం డ్వామా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు రాష్ట్ర బృందానికి పలు సూచనలు చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఏడాదికేడాది ఇసుక దిబ్బలు విస్తరిస్తున్న నేపథ్యంలో నివారణచర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేమకల్లు పర్యటనకు వచ్చిన సందర్భంలో ఈ సమస్యను ఆయన దృష్టికి తెచ్చామన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో ప్రభుత్వం ఓ ప్రత్యేక పరిశీలన బృందాన్ని రాజస్థాన్‌కు పంపి అధ్యయనం చేయించిందన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆయన ఆ బృందం సభ్యులను కోరారు. డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, డి. హోన్నూరు ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను పరిశీలించడంతో పాటు అక్కడి పరిస్థితులను కాలవకు వివరించారు. స్థానికంగా ఎడారి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చించారు. గోరింటాకు, హెన్నా, పాకుడు తీగల జాతికి సంబందించిన మొక్కలు పెంచడం ద్వారానే ఎడారి నివారణకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాన్ని పరిశీలకుల బృందం కాలవకు వివరించింది. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మొక్కల పెంపకం చేపడుతామని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముక్‌కుమార్ పేర్కొన్నారు. పూర్తిగా ప్రభుత్వం మొక్కల పెంపకం ఖర్చు భరిస్తుందన్నారు. జిల్లాలో ఎడారీకరణ నివారణే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో ఉపాధిహామీ పథకం అడిషనల్ కమిషనర్ ఎం. శివప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ ముఖ్య అధికారి ఎం. గోపీచంద్, డ్వామా పీడీ సలీం బాషా, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.




డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం, అధికారులతో మాట్లాడుతున్న కాలవ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మేరీ ఊల్‌స్టన్‌క్రాఫ్ట్ (జయంతి)



మేరీ ఊల్‌స్టన్‌క్రాఫ్ట్ 1759 ఏప్రిల్ 27న లండన్‌లోని స్పిటాఫీల్డ్స్‌లో జన్మించారు. ఆంగ్ల రచయిత్రి, తత్వవేత్త, న్యాయవాదిగా మహిళా హక్కులకోసం శ్రమిం చారు. పలు నవలలు, ఇతర రచనలు చేశారు. 'ఏ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమన్' అనే రచన ఎంతో పేరొందింది. 38వ యేట 1797 సెప్టెంబరు 10న కన్నుమూశారు. కాగా అసంపూర్ణ రచనలను ఆమె కుమార్తె మేరీ షెల్లీ పూర్తి చేశారు.

జొహ్రా సెహగల్ (జయంతి)




ఆరు దశాబ్దాలకుపైగా నటి, నృత్యకారిణి, కొరియోగ్రాఫర్‌గా రాణించిన 'పద్మ విభూషణ్' గ్రహీత జొహ్రా ముంతాజ్ సెహగల్ 1912 ఏప్రిల్ 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం సహరన్ పూర్‌లో జన్మించారు. బాలీవుడ్, బుల్లితెరపైతోపాటు బ్రిటీష్ సినిమాలలోనూ నటించారు. పృథ్వీరాజ్ కపూ ర్, అశోక్‌కుమార్, దేవ్ ఆనంద్, గోవిందా, షారుఖ్ ఖాన్, సల్మాన్‌ఖాన్, అమితాబ్ బచ్చన్, రణబీర్ ఇలా అన్ని తరం నటులతో నటించారు. 'పద్మశ్రీ', 'కాళిదాస్ సమ్మాన్' తదితర పురస్కారాలు పొందారు. 102వ యేట 2014 జూలై 10న కన్నుమూశారు.

హాండెల్ మాన్యుయెల్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత హాండెల్ మాన్యుయెల్ 1918 ఏప్రిల్ 27న తమిళనాడు రాష్ట్రం ట్యుటికోరిన్ (తూతుకూడి)లో జన్మించారు. 23వ యేట మద్రాస్ మ్యూజికల్ అసోసియేషన్‌లో నిర్వాహకులుగా వ్యవహరించారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు పియానిస్ట్, ఆర్గనిస్ట్, స్వరకర్తగా రాణించారు. పాశ్చాత్య శాస్త్రీయ సంగీతాన్ని ప్రాచుర్యం పొందేందుకు కృషి చేశారు. లండన్‌లోని రాయల్ స్కూల్ ఆఫ్ చర్చ్ మ్యూజిక్ శాశ్వత సభ్యత్వం కలిగారు. 1994 అక్టోబరు 22న కన్నుమూశారు.

విశ్వేశతీర్థ స్వామిజీ (జయంతి)



మధ్వాచార్యులు ప్రతిపాదించిన ద్వైత సిద్ధాంతాన్ని అనుసరించి కర్ణాటక రాష్ట్రం ఉడుపిలోని పెజావర పీఠాధిపతిగా సుదీర్ఘ కాలం కొనసాగిన విశ్వేశతీర్థ స్వామిజీ 1931 ఏప్రిల్ 27న దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా రామకుంజలో జన్మించారు. ఆయన పూర్వ నామం వెంకటరామ. ఏడో యేటనే సన్యాసం తీసుకుని హిందూ ఆధ్యాత్మిక గురువుగా రాణించారు. ఉడుపిలోని అష్టమఠాలలో ఒకటైన పెజావర అధోక్షజ మఠానికి 32వ అధిపతిగా కొనసాగారు. పూర్ణప్రజ్ఞ విద్యాపీఠను స్థాపించి వేద అధ్యయనాన్ని ప్రోత్సహించారు. సమాజ ఉద్ధరణకు ఎనలేని కృషి చేశారు. 'యతికుల చక్రవర్తి' గౌరవం అందుకున్నారు. 2019 డిసెంబరు 29న కన్నుమూశారు. మరణానంతరం 2020లో 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

రాత్రివేళల్లో విద్యుత్ కోతలు

ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

గుడిబండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎస్.రాయాపురం ఫీడర్ రాత్రివేళల్లో వేళాపాళా పాటించకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎస్.రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, మేకలగట్ట, తదితర గ్రామాలు అటవీప్రాంతానికి ఆనుకుని ఉండటంతో చిరుతపులులు, ఎలుగుబంట్లు గ్రామాల్లోకి చొరబడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారని విద్యుత్‌శాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కోతలు విధిస్తే ట్రాన్స్‌కో కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. విద్యుత్‌శాఖ వారు రాత్రిపూట కోత విధించకుండా సరఫరా చేయాలని కోరుతున్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే శుభోదయం: టీడీపీ

పెనుకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికే ప్రజల ముందుకు వచ్చామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం శుభోదయం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరాములయ్య కాలనీలో నాయకులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడారు. కాలనీలో డ్రైనేజీలు, చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ప్రతిరోజూ చెత్తను తొలగించి శుభ్రం చేయాలని, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని వారు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర, షౌకత్, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, ప్రభంజన్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలుచేసి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ యూనిఫాం నోటుపుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. అయితే ఫీజులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నా సౌకర్యాలు మాత్రం దారుణంగా ఉంటున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ గంగప్పను కోరారు. వినతిని అందించిన వారిలో హర్షకుమార్, భగత్, లిఖిత్, విక్రం, రోహిత్, పవన్ తదితరులు ఉన్నారు.

కశ్మీర్ మృతులకు నివాళులు



బంగారపేట కువెంపు సర్కిల్‌లో నివాళులు



బంగారపేటలో జాతీయ పతాకాలతో ర్యాలీ

బంగారపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతి చెందినవారికి సంతాపంగా మాజీ ఎంపీ మునిస్వామి నేతృత్వంలో నివాళులు అర్పించారు. కశ్మీర్‌లో పర్యాటకులను ఉగ్రవాదులు బలిగొన్నారని విచారం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, ఇతర ప్రముఖులతో కలసి పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ ముఖ్యులు బీసీ మూర్తి పురసభ సభ్యులు కపాలి శంకర్, మహేశ్, బీజేపీ ముఖ్యులు హొసరాయప్ప, హనుమప్ప, శ్రీనివాస్‌గౌడ, అంబరీశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: కశ్మీర్ ఉగ్రవాద దాడిని ఖండిస్తూ చింతామణి పట్టణంలో సమాన మనస్కుల వేదిక నేతృత్వంలో శుక్రవారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్ మృతులకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించారు. పెద్దసంఖ్యలో హిందూ ముస్లింలు పాల్గొన్నారు. ప్రభుత్వ అతిథిగృహం నుంచి పురవీధులలో ర్యాలీ సాగారు. ఉగ్రవాద చర్యలను సహించరాదని, వారికి ఎవరు మద్దతు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర: పహల్గాం ఉగ్రవాద ఘటనన ఖండిస్తూ బీజేపీ, స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సర్జాపుర హోబళి, దొమ్మసంద్ర గ్రామస్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్ మృతులకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించారు. ఆనేకల్ యోజనా ప్రాధికార మాజీ అధ్యక్షుడు జయణ్ణ, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్ నేతృత్వం వహించారు. దొమ్మసంద్ర బస్టాండ్‌లో శాంతియుతంగా శ్రద్ధాంజలి నిర్వహించారు. దివిటీలు ప్రదర్శించారు. వివేకానంద సేవా సమితి పదాధికారి మురళీధర్, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు డిఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: కశ్మీర్ ఉగ్రవాద ఘటనపై కేంద్రప్రభుత్వం పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పురసభ నామినేటెడ్ సభ్యుడు, ముస్లిం నాయకుడు సర్దార్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. కశ్మీర్ ఘటనను ఖండిస్తూ దాడిలో మృతి చెందినవారికి సంతాపం తెలిపారు. బస్టాండ్ సమీనా ఏర్పాటైన కార్యక్రమంలో సర్దార్ మాట్లాడుతూ దేశంలో హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా ఉన్నారన్నారు. ఉగ్రవాద ఘటన విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. దేశంలోని ముస్లింలు ఇక్కడే పుట్టామని ఇక్కడే చస్తామన్నారు. ఉగ్రవాదుల అణిచివేత విషయంలో ప్రధాని నరేంద్రమోదీ తీసుకునే నిర్ణయాలకు ముస్లింల మద్దతు ఉంటుందన్నారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు సంతాపం తెలిపారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



దొమ్మసంద్ర బస్టాండ్‌లో ప్రదర్శన



బాగేపల్లి బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన

కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్

పెనుకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. శనివారం సీఐటీయూ సర్వసభ్య సమావేశం బాబావలి, బావమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ మేడేను ఘనంగా నిర్వహించడానికి అందరి సహకారం అవసరమన్నారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సీఐటీయూ నాయకులు మహబూబ్‌బాషా, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ నాయకులు జయమ్మ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నవెంకటేశ్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసీ, రాజేశ్వరి, తోపుడుబండ్లయూనియన్ నాయకులు హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అణ్ణమ్మదేవి ఉత్సవం



వేదికపై ప్రముఖులకు సన్మానం, నిర్వాహకులు



అమ్మవారికి అలంకరణ

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బేగూరు హోబళి మైకో లే అవుట్‌లో అణ్ణమ్మదేవి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. 51మంది కళశాలతో పుర వీధులలో ఊరేగారు. విశేషపూజా కార్యక్రమాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, మహామంగళారతి అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక అలం కరణ, విశేషపూజలు, మధ్యాహ్నం ప్రసాదం పంపిణీ, సాయంత్రం ఆర్కెస్ట్రాతో సందడి సాగింది. సీనియర్ సిటిజన్లకు, వివిధ రంగాల సాధకులకు సన్మానం చేశారు. ఆదివారం సుమారు 10వేలమందికి అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆంజినప్ప, సతీశ్‌రెడ్డి, కేశవరెడ్డి, సంపత్, గ్రామదేవత అణ్ణమ్మదేవత ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణకుమార్, రమణ, కిరణ్, యువరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రజల పక్షం



ప్రథమ స్థానం బైక్ అందుకుంటున్న టి. స్వప్న



ద్వితీయ స్థానం రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న మహబూబ్‌పీరా

- కార్ అండ్ బైక్ రేస్ విజేతలు
- బహుమతులను అందుకున్న పాఠకులు

అనంతపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రజల పక్షంగా నిలుస్తోందని కార్ అండ్ బైక్ విజేతలు అన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. ఉమ్మడి జిల్లా, కర్ణాటక పాఠకులు పంపిన 12వేలకుపైగా కూపన్ల నుంచి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, అనంతలక్ష్మి విద్యాసంస్థల ఛైర్మన్ అనంతరాముడు లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రథమ బహుమతిగా కదిరికి చెందిన టి. స్వప్నకు బైక్‌ను, రెండో బహుమతిగా కణేకల్లుకు చెందిన పి.మహబూబ్ పీరాకు రెఫ్రిజిరేటర్‌ను, మూడో బహుమతిగా ధర్మవరానికి చెందిన ఆర్.మహాలక్ష్మికి కలర్ టీవీని ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ గోపాల్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జ్ రామకృష్ణుడు, డిప్యూటీ మేనేజర్(ప్రకటనలు), డీసీఎం నారాయణస్వామి నాయక్, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సురేష్‌బాబు తదితరులు అందజేశారు.



తృతీయ బహుమతి టీవీ అందుకుంటున్న మహాలక్ష్మి

ఎంతో సంతోషంగా ఉంది...

ఆంధ్రజ్యోతి పాఠకురాలిగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మొదటి నుంచి ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నాం. రాజకీయాలు, ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు చదవించేలా, ఆలోచింపజేసేలా ఉంటాయి.

- టి. స్వప్న, కదిరి

మరువలేని బహుమతి..

సమగ్ర సమాచారాన్ని పాఠకులకు చేరవేసే ఆంధ్రజ్యోతి.. ఇలా ఒక పాఠకుడైన నాకు బహుమతి ఇవ్వడం ఎన్నటికీ మరువలేను. రెండో బహుమతిగా రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

- పి.మహబూబ్ పీరా, కణేకల్లు

గర్వపడుతున్నా..

ఆంధ్రజ్యోతి పాఠకురాలినైనందుకు గర్వపడుతున్నాను. వార్తలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపడమే కాకుండా పాఠకులను ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం బహుమతులను ఇవ్వడం సంతోషకరం. వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

- ఆర్.మహాలక్ష్మి, ధర్మవరం

మే 3, 4 తేదీల్లో వధూవర పరిచయ వేదిక

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బసవనగుడి గాయనసమాజలో మే 3, 4 తేదీలలో 'శుభస్య శీఘ్రం' పేరిట వధూవర పరిచయ వేదిక కార్యక్రమం జరగనుంది. హిందూ ధర్మంలోని అన్ని సముదాయాలకు చెందిన వధూవరులు పాల్గొనవచ్చునని నిర్వాహకులు ప్రకటించారు. రైతు కుటుంబాల వధువులకు, బీపీఎల్ కార్డుదారులకు ఉచిత ప్రవేశమని, ఇతరులకు కనీస ప్రవేశరుసుం నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మే 1లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉర్రూతలూగించిన నృత్య ప్రదర్శన

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు యువతను ఉర్రూతలూగించాయి. డ్రాగ్ డైనస్టీ 2.0 పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కెనడాకు చెందిన డ్రాగ్‌రేస్ విజేత రాణి ప్రియాంక నేతృత్వంలో జాతీయ, అంతర్జాతీయ కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఫ్యాషన్, పవర్‌ప్యాక్ ప్రదర్శనలో యువత ఉత్సాహంగా పాల్గొంది. ఇదే సందర్భంగా రాణి ప్రియాంక మాట్లాడుతూ భారత్‌లో ప్రదర్శనలు ఇచ్చే ప్రతిసారి ఎన్నో అనుభవాలను పొందినట్టు అవుతుందన్నారు.

వైట్‌ఫీల్డ్ పాఠకుడికి బహుమతి ప్రదానం



బహుమతిని అందజేస్తున్న రామచంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి బైక్ అండ్ కార్ రేస్ పోటీల్లో లక్కీడ్రా విజేతకు శనివారం బహుమతి ప్రదానం చేశారు. వైట్‌ఫీల్డ్‌కు చెందిన కిరణ్‌కుమార్‌కు కన్సొలేషన్ బహుమతి దక్కింది. ఈ మేరకు కిరణ్‌కుమార్ భార్య అంజలికి బెంగళూరు కార్యాలయం సీనియర్ అకౌంటెంట్ ఎం.రామచంద్ర బహుమతిని ప్రదానం చేశారు.

30న మణిపాల్ హాస్పైస్ రెస్పైట్ సెంటర్ ప్రారంభం

బెంగళూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మణిపాల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హాస్పైస్ రెస్పైట్ సెంటర్‌ను ఈనెల 30న ప్రారంభిస్తున్నట్టు ప్రొ-చాన్స్‌లర్ డాక్టర్ హెచ్ఎస్ బల్లాల్ తెలిపారు. కస్తూర్బా మెడికల్ కళాశాల ఆసుపత్రి మణిపాల్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్యాలియేటివ్ కేర్‌ల సహకారంతో సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభిస్తారన్నారు. వైస్‌చాన్స్‌లర్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ ఎండీ వెంకటేశ్‌తో కలసి వర్చువల్ మీడియాకు వివరించారు.

కాకరగల్ టోల్‌గేట్ ధ్వంసం

- ఎమ్మెల్యే కుమారుడిపై కేసు నమోదు



ధ్వంసమైన టోల్‌గేట్

రాయచూరు ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్మలా నుంచి తింథిణి బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డుపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లు వివాదాస్పదమయ్యాయి. కాకరగల్‌తో పాటు జాలహళ్ళి వద్ద మరొక టోల్‌గేట్‌ను ఏర్పాటు చేయగా తొలి నుంచి ఈ టోల్‌గేట్‌ల ఏర్పాటును కొంత మంది వ్యతిరేకిస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో ఎమ్మెల్యే కుమారుడు సంతోష్ నాయక్ తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి టోల్‌గేట్ వద్దకు వెళ్లి ఘర్షణకు దిగి టోల్‌గేట్‌ను ధ్వంసం చేశారు. ఆయన వెంట 30 మందికిపైగా యువకులున్నట్లు స్థానికులు తెలిపారు. యువకులు సృష్టించిన గలాటలో రూ.18 లక్షలకుపైగా విలువైన వస్తువులు ధ్వంసమైనట్లు బాధితులు తెలిపారు. టోల్‌గేట్ యజమాని నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గబ్బూరు పోలీసులు దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ కుమారుడు సంతోష్ నాయక్‌తో పాటు మరో 16 మందిపై కేసు నమోదు చేశారు.

కరపత్రాలు విడుదల

అగళి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ఆధ్వర్యంలో అంబేడ్కర్ సేవా పురస్కార కరపత్రాలు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు ఎం శ్రీనివాస్, ఎంఎస్ రఘునాథ్, మరం లక్ష్మీనారాయణ, రవితో కలిసి సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన వారికి, సమాజసేవ చేస్తున్న కార్యకర్తలకు అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా సేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమం ఈనెల 29న మడకశిరలో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దళిత నాయకులు కాంతరాజు, కిట్టి, నాగోజీ, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం తపాలాశాఖ డివిజన్‌లో తపాలా జీవిత బీమా ఏజెంట్లకు దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30లోపు హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. పదోతరగతి చదివి 50ఏళ్లలోపు వయసుండాలని ఆధార్, టీసీ, పాన్‌కార్డు, రెండు ఫోటోలు, సెక్యూరిటీ డిపాజిట్‌కింద రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి పాలసీలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్, ఇన్సెంటివ్ చెల్లించడం జరుగుతుందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.29	1,578.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	388	65
నీటి నిల్వ (టీఎంసీలు)	6.87	3.80

1 నుంచి ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు



బళ్లారి సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతోత్సవాలు వైశాఖ చతుర్థి పంచమి మే 1, 2 తేదీల్లో సంగనకల్లు రోడ్డులోని శారదా శంకర మఠంలో ఘనంగా నిర్వహించాలని భక్తులు నిర్ణయించారు. 1న సాయంత్రం స్థానిక సత్యనారాయణపేటలోని వెంకటరమణ ఆలయం నుంచి సభాపతి వీధిలోని శంకర మఠం వరకు శంకర భాగవతాత్పరుల చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహిస్తారు. సంగనకల్లు రోడ్డులోని శంకరమఠంలో రెండు రోజుల పాటు పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మతపరమైన కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకుడు మురళి కోరారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



రైతులకు పంపుసెట్ల సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీ తుకారామ్, ఎమ్మెల్యే అన్నపూర్ణ

కంప్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతన్నలు ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ తుకారామ్, ఎమ్మెల్యే అన్నపూర్ణ కోరారు. శనివారం సండూరులోని తమ కార్యాలయంలో 2019-20, 2020-21 సంవత్సరం నాటి గంగ కల్యాణ పథకం ద్వారా తొమ్మిది మంది రైతులకు పంపుసెట్లు సామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు విద్యార్థులకు, మహిళలకు అనుగుణంగా అన్ని రకాల పథకాలు అందించి ఆదుకుందన్నారు. వాటిని సద్వినియోగపరచుకుని ఆర్థికంగా మెరుగుపడాలని కోరారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోండి



ముద్దటనూరు సొసైటీలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మాధవరెడ్డి సూరిబాబు

కంప్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సిరిగేరి పరిధిలో జొన్నలు పండించిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ముద్దటనూరు సొసైటీ ప్రెసిడెంట్ సూరిబాబు కోరారు. శనివారం ముద్దటనూరు కృషి పత్తిన సహకార సంఘం ప్రాంగణంలో జొన్నల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జొన్నలు విక్రయించే రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశారు. కార్యక్రమాన్ని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మాధవరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు జొన్నలు విక్రయించేందుకు సిరుగుప్ప వెళ్లేవారన్నారు. రైతులు పడుతున్న కష్టాలను సూరిబాబు దృష్టిలో వుంచుకుని ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పేర్లు నమోదు చేసి విక్రయించుకోవాలన్నారు. ముద్దటనూరుతో పాటు హావినాళ్, గుండిగనూరు, సిరిగేరి, చెన్నపట్నం, మన్నూరు, సూగూరు మల్లాపురం తదితర గ్రామాల రైతులు పేర్లు నమోదు చేసుకునేందుకు తరలివచ్చారు. అధికారి మహంతేష్ గౌడ, సత్యనారాయణ, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాలకు శాశ్వత పరిష్కారం చూపాలి



సింధూరులో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

రాయచూరు ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ఈ ప్రాంత రైతులకు జీవనాడిగా ఉన్న జలాశయాన్ని పరిరక్షించాలని బీజేపీ సీనియర్ నాయకుడు కరియప్ప డిమాండ్ చేశారు. తుంగభద్ర జలాశయం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం సింధనూరు తాలూకా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. సింధనూరు నగరంలో ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి తమ నిరసనను వినిపించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రాజకీయ ప్రయోజనాల కోసం మొక్కుబడిగా రైతు ప్రయోజనాలపై మాట్లాడడం తప్ప శాశ్వత పరిష్కారం దిశగా చేసిన కృషి లేదన్నారు. క్రస్ట్ గేట్‌లను పునరుద్ధరించి కొత్త వాటిని నిర్మించడంతో పాటు జలాశయంలో పేరుకుపోతున్న వండును తొలగించడం, రైతులకు చివరి ఆయాకట్టు వరకు నీరందించడం తదితర వాటిపై అధికారులు నాయకులు దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు చేశారు.

70 ఏళ్లుగా షెడ్లలోనే జీవనం..!

- దెబ్బతిన్న నివాసాలు ● అసౌకర్యాల నడుమ అగచాట్లు
- ఇదీ నాలుగు మైనింగ్ ప్రభావిత ప్రాంతాల దుస్థితి



నాగప్ప క్యాంపులో షెడ్లలో నివసిస్తున్న ప్రజలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హొసపేట నుంచి బళ్లారికి వెళ్లే వడ్డర హళ్ళి హైవే కుడి వైపున నాలుగు గనుల ప్రభావిత శిబిరాలకు చెందిన ప్రజలు 70 ఏళ్లుగా షెడ్లలో జీవనం సాగిస్తున్నారు. మెరుస్తున్న కొత్త వాటర్ ట్యాంక్ తప్ప, అక్కడ ఉన్నందంతా మైనింగ్ దుమ్ముతో కప్పబడిన షెడ్లు మాత్రమే. అలాంటి ఇంటిలో గడిపే సమయం కంటే బయటే ఎక్కువ. ఎందుకంటే అవి ఇళ్లు కావు, మైనింగ్ కంపెనీలు నిర్మించిన షెడ్లు. విరిగిన దూలాలు, లీకవుతున్న పైకప్పులు, భారీ వర్షంలో మొత్తం షెడ్ కూలే పరిస్థితిలో ఉన్నాయి. ఈ ఇళ్లలో నివసిస్తున్నవారికి ఎవరికీ హక్కుపత్రాలు(పట్టా) లేవు. ఈ ఇళ్లను కూల్చివేసి కేఎంఈఆర్‌సీ గ్రాంట్లతో కొత్త ఇళ్లను నిర్మించాలి. అది ఎప్పుడు జరుగుతుందనేది ఇక్కడి నివసిస్తున్న వారి ప్రశ్న. పాపినాయకన హళ్ళి పంచాయతీ పరిధి నాగప్ప క్యాంప్, వీబీఎస్ క్యాంప్, జీజీ క్యాంప్, శంకర్‌నగర్ క్యాంపులలో సాధారణ దృశ్యాలు ఇవి. వీబీఎస్, జీజీ క్యాంపులు ప్రైవేట్ కంపెనీ భూములు, ఇది ఇప్పుడు భూమి రిజిస్ట్రీలో ప్రభుత్వ భూమిగా జాబితా మార్చారు. ఇతర క్యాంపులు, రవెన్యూ గ్రామాల పరిధిలోకి వచ్చినా ఎవరికీ పట్టాలేదు. నాలుగు క్యాంప్‌లను కలుపుకుని శంకర్‌నగర్‌ను రెవెన్యూ గ్రామంగా మార్చాలనే ప్రణాళిక ఉన్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. మురుగునీరు ఇళ్లముందు ప్రవహిస్తున్నాయి. కాలనీల్లో డ్రైనేజీ సౌకర్యం కూడా లేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ మలవిసర్జన చేయాల్సిన పరిస్థితి. గనుల ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు సహాయం చేయడం పట్ల నిజంగా మక్కువ ఉన్న అధికారులు అవసరం ఉందని బాలాసాబ్ నాగప్ప నివాసి అన్నారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

బళ్లారి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులపై ఉగ్రదాడిని ఖండిస్తూ నగరంలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి రాయల్ సర్కిల్, మోతి సర్కిల్ వరకు మాజీసైనికుల సంఘం అధ్యక్షుడు ప్రహ్లాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కొవొత్తుల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మతంలేదు, కులంతో సంబంధం లేకుండా యాత్రికులపై ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ నిర్వహించామన్నారు. అమాయకులను చంపిన నరరూపరాక్షసులను ఉరితీయాలన్నారు. ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజసింహ, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్, సెక్రటరీ వీరారెడ్డి, మాజీసైనికులు పాల్గొన్నారు.

మృతులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

బళ్లారి సిటీ: ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు నింబగల్ రామకృష్ణ కోరారు. హొసపేటలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నిరసన సమావేశంలో మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సాయంత్రం కొవొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ ఉపాధ్యక్షుడు హాలప్ప, హుడా అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్ అధ్యక్షుడు దాదాపీర్, మహమ్మద్ ఇమామ్ నియాజీ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

సిరుగుప్ప: జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలి ముస్లిం సంఘంనాయకుడు మహ్మద్ సఫీ ప్రభుత్వాలను కోరారు. శనివారం పట్టణంలో కశ్మీర్‌లో జరిగిన సంఘటనకు నిరసనగా వివిధ ముస్లిం సంఘాలు, కాంగ్రెస్ కార్యకర్తలు కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. సయ్యద్ బిరుదార్, అబ్దుల్లానబీ, అంబిహుశేన్ బాషా, కరిబసప్ప పాల్గొన్నారు.



బళ్లారి, సిరిగుప్పలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ర్యాలీ

గుల్బర్గా రోడ్లపై పాకిస్థాన్ స్టిక్కర్లు

పోలీసుల అదుపులో బజరంగదళ్ కార్యకర్తలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గుల్బర్గా నగరం రోడ్లపై పాకిస్తాన్ ధ్వజానికి సంబంధించి స్టిక్కర్ అంటించడంపై కలకలం లేపింది. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఒక్క సారిగా అలర్ట్ అయ్యారు. గుల్బర్గా రోడ్లపై పాకిస్తాన్ జెండా స్టిక్కర్ ఎవరు అంటించారు అనే విషయంపై నగర పోలీసులు తీవ్రంగా తీసుకోవాల్సి వచ్చింది. ఆఖరికి బజరంగదళ కార్యకర్తలే పాకిస్తాన్ స్టిక్కర్‌ను రోడ్లపై అంటించినట్లు అంగీకరించడంతో కథ సుఖాంతమైంది. అయితే అనుమతి లేకుండా పాకిస్తాన్ జెండా స్టిక్కర్ అంటించడంపై నగరంలో కొన్ని గంటల సేపు నగర ప్రజల్లో ఉత్కంఠం నెలకొంది. ఇందుకు కారణమైన వారిని పోలీసులు గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జమ్ము-కాశ్మీర్ పహల్గామ్‌లో హిందువులను టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు జరిపిన దాడులకు సంబంధించి ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఆక్రోషాలు, పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సమయంలో గుల్బర్గా నగరంలో జగత్ సర్కిల్, నేషనల్ సర్కిల్ రోడ్లపై పాకిస్తాన్‌కు చెందిన స్టిక్కర్‌లను వరుసగా అంటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడే లేని విధంగా... ప్రస్తుతం సమయంలో ఇంటి ఘటనలు చోటుచేసుకోవడం జనసామాన్యులను ఆశ్చర్యపరిచేలా చేసింది. ఇలాంటి ఆకస్మిక ఘటనలు వెలుగు చూడడంతో మరోవైపు శాంతిభద్రతలకు నష్టం వాటిల్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పాకిస్తాన్ స్టిక్కర్‌లు అంటించిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. పోలీసుల అనుమతి లేకుండా రోడ్లపై ఇలాంటి ఘటనకు పాల్పడరాదని, అనుమతులు లేకుండా పోరాటాలు చేయరాదని ప్రజలకు సూచించారు. ఆందోళనలు, ప్రతిఘటనలు చేయాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఘటనా స్థలానికి నగర పోలీసు కమీషనర్ చేరుకుని పరస్థితి సమీక్షించి స్టిక్కర్‌లు తొలగించాలని అధికారులను ఆదేశించారు.



ప్రధాన సర్కిళ్లలో పాకిస్తాన్ జెండా స్టిక్కర్లు

అధ్యయనం పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిద్ధరామ కల్మఠ్

బళ్లారి సిటీ,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అధ్యయనం పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు సిద్ధరామ కల్మఠ్ సూచించారు. నగరంలోని వి.వి. కొట్టూరు స్వామి ఉపాధ్యాయ విద్యా కళాశాలలో కన్నడ సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో కన్నడ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఏకీకరణ అనేది కన్నడిగుల నిరంతర పోరాటమన్నారు. రాష్ట్రంలో బళ్లారి, మైసూర్ మొదటి జిల్లా ఏకీకరణకు నాంది పలికిందన్నారు. బళ్లారి విలీనానంతరం జరిగిన విజయోత్సవ వేడుకకు ముందు రోజు జరిగిన ఒక సంఘటనలో పైల్వాన్ పింజర్ రంజాన్‌సాబ్ యాసిడ్ బల్బ్ దాడిలో మృతిచెందారని గుర్తు చేశారు. సమైక్య ఉద్యమానికి ఏకైక వ్యక్తిగా ఉద్యమ సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు కొర్లగుంది పెద్ద కేశవరెడ్డి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సతీశ్ హిరేమఠ్ మాట్లాడుతూ పుస్తక సంస్కృతిని పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాల అవసరాన్ని సమర్థించారు. విద్యార్థులు తమ మాతృభాషపై గర్వపడాలని అన్నారు. కన్నడ ఉపాధ్యాయుడు జయన్న, కన్నడ అనుకూల నాయకుడు సిద్మల్ మంజునాథ్, మహేశ్, ఆనంద్, కుమారి పాల్గొన్నారు.

హోసూరు జోన్

పెంచిన ఆస్తిపన్ను తగ్గించాలి



నల్ల మాస్కులతో నిరసన తెలుపుతున్న వ్యాపారులు

హోసూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో పెంచిన ఆస్తిపన్నును తగ్గించాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు నిరసన తెలిపారు. సుమారు 3వేలకుపైగా దుకాణాల వద్ద నల్లజెండాలు ప్రదర్శించారు. రామనగర్ ప్రాంతంలో వ్యాపారులు నల్లటి మాస్కులు ధరించి నిరసనలో పాల్గొన్నారు. పెంచిన ఆస్తిపన్నును తగ్గించాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న చెత్తపన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకు 32 సంఘాలు మద్దతు ఇచ్చాయి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించనిపక్షంలో పోరాటం తీవ్రం చేస్తామని, దుకాణాలకు తాళం వేసి నిరాహారదీక్ష చేస్తామన్నారు.

గుర్రపుడెక్కను తొలగించండి



చంద్రాంబి సరస్సు ఇలా...

హోసూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల వందకుపైగా సరస్సులు, చెరువులు ఉన్నాయి. స్థానిక దర్గావద్ద చంద్రాంబి చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయింది. హోసూరు - బెంగళూరు జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న దర్గా ప్రాంతంలో చంద్రాంబి చెరువు ఉంది. ఈ సరస్సు ఎల్లప్పుడూ నీటితో ఉంటుంది. కాబట్టి ఏడాది పొడవునా విదేశీపక్షులు సందర్శిస్తాయి. సరస్సు చుట్టూ ఉన్న ఇళ్లు, ఫ్యాక్టరీలనుంచి వ్యర్థాలు చేరడంతో కలుషితం అవుతోంది. సరస్సుకు అనుబంధమైన మార్గాలలో సంచరించాలంటే ముక్కు మూసుకుని సంచరించాల్సిన పరిస్థితి వాపోతోందని ప్రయాణీకులు వాపోతున్నారు. గుర్రపుడెక్కను తొలగించి సరస్సులో బోటింగ్ సదుపాయం, చెరువుకు అనుబంధంగా పార్కు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దావణగెరెలో పాకిస్తాన్ వైద్య విద్యార్థిని



మాట్లాడుతున్న ఎస్పీ ఉమా ప్రశాంత్

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించడంతో పాటు దేశంలో ఉన్న పాకిస్తాన్ ప్రజలను వెంటనే దేశాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో దావణగెరె నగరంలో పాకిస్తాన్‌కు చెందిన ఓ మెడికల్ విద్యార్థి ఉన్నట్లు జిల్లా పోలీసు శాఖ గుర్తించింది. దీనిపై ఎస్పీ ఉమా ప్రశాంత్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇప్పటికే కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయని, అయితే ప్రస్తుతం దావణగెర నగరంలో మెడికల్ కోర్సు చదువుతున్నట్లు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌టీవీ ఎడ్యుకేషన్ వీసా(లాంగ్ టర్మ్ వీసా) పొంది ఎంబీబీఎస్ చదువుతున్నట్లు, ఈ మహిళపై ఎలాంటి చర్యలు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎస్పీ వివరించారు. కేంద్ర ప్రభుత్వం పాక్ సిటిజన్స్‌కు వీసా ఇచ్చిందని, వీసా గడువు 2025 ఆగస్టు వరకు ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థి భవిష్యత్తు దృష్ట్యా పై అధికారుల సూచనల మేరకు ఎలాంటి చర్యలు చేపట్టనవరం లేదని స్పష్టం చేశారు.

ఘనంగా ఎస్‌యూసీఐ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూసీఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ 78వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.సోమశేఖర్ మాట్లాడుతూ మార్క్సిజం కేవలం ఆర్థిక-రాజకీయ సిద్ధాంతం కాదని, ఇది కమ్యూనిస్టులు తమ జీవితాల్లో అమలు చేయాల్సిన శాస్త్రీయ తత్వశాస్త్రమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నారు. వాటి మార్కెట్లను రక్షించుకోవడానికి పన్ను యుద్ధంలో నిమగ్నమై ఉన్నాయని అన్నారు. భారతదేశం కూడా అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 11సంవత్సరాలుగా మతపరమైన పెట్టుబడిదారీ అనుకూల విధానాలు అమలు చేస్తోందన్నారు. కార్మికులు, రైతుల హక్కులపై దాడి జరిగిందన్నారు. హిందూ మెజారిటీ ఉనికి ప్రమాదంలో ఉందని బీజేపీ సంఘ్ పరివార్ ప్రచారం చేస్తూనే ఉందన్నారు. దీని ద్వారా ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య ప్రైవేటీకరణ, అవినీతి, పర్యావరణ విధ్వంసం తదితర అన్ని సమస్యలు దాచేస్తోందన్నారు. కార్యక్రమంలో మంజుళ, జిల్లానాయకులు దేవదాస్, సోమశేఖర్‌గౌడ, డాక్టర్ ప్రమోద్, శాంత, గోవింద్ పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయండి



టోకెన్ల పంపిణీ కేంద్రం వద్ద రైతుల తొక్కిసలాట

సిరుగుప్ప,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జొన్నల టోకన్లు పంపిణీ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. రబీ సీజన్‌లో జొన్నల పంట అధిక దిగుబడి రావడంతో తాలూకాలోని అన్ని సంపర్కకేంద్రాల్లో టోకన్ల పంపిణీలో భారీ రద్దీ పెరగడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వృద్ధ రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. తాలూకాలో ప్రధానంగా అచ్చొళ్లి, కరూర్, సిరుగుప్ప, తెక్కలకోట పట్టణాల్లో పోలీసబందోబస్తు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పశువులకు టీకా వేయించండి



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి బసవరాజు

కంప్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులకు కాలువాపు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా రైతులు, పశువుల కాపరులు తమ పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ బసవరాజు కోరారు. శనివారం తాలుకా పరిధిలోని నంబర్ టెన్ ముద్దాపురం గ్రామంలో పశుశాఖ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పశువులకు డాక్టర్ బసవరాజు టీకాలు వేశారు. ప్రతి ఒక్కరు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ శివప్ప, పంచాయతీ సభ్యులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం దగ్ధం



కాలుతున్న బొలెరో వాహనం

రాయచూరు ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా గాణదాళ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి పిడుగు పడి బొలెరో వాహనం దగ్ధమైంది. గాణదాళ గ్రామానికి చెందిన హనుమంతరాయ అనే వ్యక్తి తన బొలెరో వాహనాన్ని టెంకాయ చెట్ల కింద నిలిపి ఉంచాడు. గాలిదుమారంతో పాటు ఉరుములు మెరుపులుతో కూడిన వర్షం రావడంతో ఒక్క సారిగి పిడుగు చెట్టు పై పడింది. దీంతో చెట్టు కింద ఉన్న బొలెరో వాహనానికి నిప్పంటుకుని కాలిపోయింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన దేవదుర్గ పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు 36 గొర్రెలు, రెండు ఆవుల మృతి

కంప్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజులుగా పలుచోట్ల గాలివాన వడగండ్లు మెరుపు పిడుగులు పడుతున్నాయి. అకాల వర్షాల వల్ల రైతన్నలు పశువుల కాపరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యలబుర్గ తాలుకా గుండాల గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగుపడి ఐదు గొర్రెలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన మల్లన్న గొర్రెల మేత కోసం అడవులకు వెళ్లగా సాయంత్రం వర్షం కురవడంతో గొర్రెలు ఒక చెట్టు కిందికి వెళ్లాయి. చెట్టుపై పిడుగు పడటంతో 35 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బసవరాజు తెన్నల్లి, వెటర్నరీ అధికారి సిద్దప్ప చవాన్, బేవూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మహంతేష్ సజ్జన్‌తో ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అకాల వర్షాల సమయంలో కాపరులు జాగ్రత్త వహించాలన్నారు.



గొర్రెలు, ఆవు కళేబరాలు